సాక్షి
ఒడిశా

శనివారం । 17 । జూన్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.70,018లు, వెండి 2 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



సంస్కృతిని అంతా పరిరక్షించాలి

-8లో



పట్టుబడిన దోపిడి దొంగలు

-8లో

న్యూస్‌రీల్

290కి చేరిన మృతులు

• బహనాగా రైలు ప్రమాదంలో ఒకే రోజు ఇద్దరి మృతి



భువనేశ్వర్: బాలాసోర్ జిల్లా బహనాగా బజార్ రైల్వేస్టేషన్ సమీపంలో ఈనెల 2న జరిగిన మూడు రైళ్ల దుర్ఘటనలో మరో ఇద్దరు వ్యక్తులు శుక్రవారం మరణించారు. దీంతో ప్రమాదంలో మృతిచెందిన వారి సంఖ్య 290కి చేరింది. కటక్ ఎస్సీబీ వైద్య కళాశాల ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బాధితుడు తుదిశ్వాస విడిచినట్లు సంబంధిత వైద్య వర్గాలు అధికారికంగా ప్రకటించాయి. ఈ మేరకు స్థానిక ఠాణా పోలీసులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం ఇతరేతర ప్రక్రియ ముగించి మృతుని కుటుంబీకులకు మృతదేహం అందజేయనున్నట్లు తెలిపారు. మృతుడు బీహార్‌కు చెందిన ప్రకాష్‌రామ్(17)గా గుర్తించారు. తల, కాలికి బలమైన గాయాలతో తీవ్ర అస్వస్థతతో బాధితుడు ఆస్పత్రి సర్జరీ వార్డులో భర్తీ అయ్యారని ఎస్సీబీ మెడికల్ కళాశాల ఆస్పత్రికి చెందిన డాక్టర్ అవినాష్ రౌత్ వెల్లడించారు. శరీరంలో అంతర్గత గాయాలకు గురవ్వడంతో గత కొన్ని రోజులుగా అతని పరిస్థితి క్షీణించిందని, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వివరించారు. అలాగే బహనాగా బజార్ రైలు దుర్ఘటనలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన రెండో వ్యక్తి ప్రకాష్‌రామ్. ఇంతకుముందు బీహార్‌కు చెందిన బిజయ పాశ్వాన్ ఇదే ఆస్పత్రిలో చికిత్స పొందుతు తుదిశ్వాస విడిచినట్లు పేర్కొన్నారు.

వన్యప్రాణుల అవశేషాలు స్వాధీనం



అటవీశాఖ సిబ్బంది స్వాధీనం చేసుకున్న వన్యప్రాణి అవశేషాలు

కొరాపుట్: ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల అటవీశాఖ సిబ్బంది సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో వివిధ వన్యప్రాణుల అవశేషాలు స్వాధీనం చేసుకున్నారు. నవరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ సమితి మండిబెడ పంచాయతీ కల్మదుంగారి గ్రామంలో శుక్రవారం సామూహికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా కుష్ భొత్ర, థామర్ మాఝి, మెహన్ సింగ్ నివాసాల్లో పులిచర్మం, గోళ్లు, దంతాలు, నెమలి, జింక అవశేషాలు లభ్యమయ్యాయి. నిందితుల వద్ద నుంచి బాణాలు, ఈటెలు తదితర వేట వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. వీరు తరచూ ఛత్తీస్‌గఢ్ పరిధిలోని అటవీ భూభాగంలో వన్య ప్రాణులను వేటాడి తెస్తున్నారని, వాటి శరీర భాగాలను స్మగ్లింగ్ చేస్తున్నారని అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి, ఇతర వివరాల కోసం దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ ఎంపీ అనాది చరణ్ దాస్ మృతి



అనాది చరణ్‌దాస్(ఫైల్)

భువనేశ్వర్: లోక్‌సభ మాజీ సభ్యుడు అనాది చరణ్‌దాస్ శుక్రవారం కన్నుమూశారు. భువనేశ్వర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. దీర్ఘకాలంగా మధుమేహంతో బాధపడుతున్న ఆయన.. గత ఏడాది ఆగస్టులో ఛాతి నొప్పి రావడంతో శస్త్రచికిత్స నిర్వహించి, పేస్‌మేకర్ అమర్చారు. మరణించే నాటికి ఆయన వయస్సు 92 ఏళ్లు. చరణ్‌దాస్ 5సార్లు జాజ్‌పూర్ లోక్‌సభ స్థానం నుంచి ఎన్నికై, భారత పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహించారు. వరుసగా 3సార్లు కాంగ్రెస్ అభ్యర్థిగా, 2సార్లు జనతాపార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. ప్రధానమంత్రులు ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, విశ్వనాథ ప్రతాప్‌సింగ్, చంద్రశేఖర్, పీవీ నర్సింహారావు హయాంలో ఎంపీగా ఉన్నారు. జాజ్‌పూర్ నుంచి 1971, 1980, 1984 సంవత్సరాల్లో కాంగ్రెస్ టిక్కెట్‌పై, 1989, 1991లో జరిగిన ఎన్నికల్లో జనతాపార్టీ ప్రతినిధిగా లోక్‌సభకు ఎన్నికయ్యారు.

సీఎం సంతాపం..

జాజ్‌పూర్ నియోజకవర్గ లోక్‌సభ మాజీ సభ్యుడు అనాది చరణ్‌దాస్ మృతి పట్ల ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సంతాపం ప్రకటించారు. ఆయన మరణం అత్యంత విచారకరమని, సమర్థత కలిగిన రాజకీయ నాయకుని కోల్పోయామని విచారం వ్యక్తం చేశారు. చరణ్‌దాస్ చేపట్టిన పలు సంక్షేమ కార్యక్రమాలు ప్రజల హృదయాల్లో సుస్థిర జ్ఞాపకాల్ని నింపాయన్నారు. దివంగత ఎంపీ కుటుంబీకుల పట్ల సానుభూతి వ్యక్తంచేశారు.

నకిలీలలు..!

• పూరీలో నకిలీ ప్రసాద విక్రయాల కలకలం
• గోప్య సేవలతో పత్యపు నైవాద్యాలకే పరిమితమైన జగన్నాథుడు
• భక్తులను మోసగిస్తూ బహిరంగ ప్రదేశాల్లో ప్రసాదాల తయారీ
• అధికారుల ఆకస్మిక తనిఖీతో పరారీలో ముఠా



జగన్నాథుని దర్శనం కోసం సర్వ భక్తజనం ఉవ్విళ్లూరుతుంది. దాదాపు గత 15 రోజులుగా స్వామివారిని కనులారా తిలకించలేని భక్తులు.. దేవదేవుని రాక కోసం ఒళ్లంతా కళ్లు చేసుకుని నిరీక్షిస్తారు. దర్శనానంతరం ఒభొడా(స్వామి అన్న ప్రసాదాలు-మహా ప్రసాదం) సేవించి తనివి తీరా పూరీ యాత్ర ముగించుకునే భాగ్యం కోసం తహతహలాడతారు. అయితే భక్తజన హృదయాల భావోద్వేగాన్ని సొమ్ము చేసుకునే దిశలో దళారులు పలు రకాల మోసాలకు పాల్పడుతున్నారు. తాజాగా ఇటువంటి ఘటనే విస్మయం కలిగించింది.

– భువనేశ్వర్



నకిలీ అన్న ప్రసాదాలకు సన్నాహాలు



పాయికా సాహిలో ముఠా సభ్యులు ఏర్పాటు చేసిన మహా ప్రసాదాల డేరా



ఒభొడా(అన్న ప్రసాదం) తరహాలో విక్రయానికి సిద్ధం చేసిన కూర, పప్పు

ముందస్తు ఆర్డర్‌పై..


ప్రధానంగా పూరీ లోక్‌నాథ్ రోడ్ పాయికా సాహి ప్రాంతం బహిరంగ ప్రదేశంలో ఒక టెంట్ కింద 'మహాప్రసాద్' తయారీ చేపట్టి, విక్రయిస్తున్న విషయం బయటకు పొక్కింది. అధికారులు, మీడియా ప్రతినిధులు ఘటనా స్థలానికి చేరుకోవడంతో నకిలీ 'మహాప్రసాద్' తయారీలో నిమగ్నమైన వారు అక్కడి నుంచి పారిపోయారు. ఘటనపై ఆరా తీయగా గుండిచా మందిరం, నృసింహనాథ్ ఆలయం, సింగడా తదితర యాత్రికులు, పర్యాటకుల సందర్శన కూడలి ప్రాంతాలకు చేరువలో పలు చోట్ల నకిలీ ఒభొడా విక్రయం జోరుగా సాగుతున్నట్లు సమాచారం అందింది. స్థానికుల అభ్యర్థన మేరకు వ్యక్తిగత కార్యకలాపాల నేపథ్యంలో ముందస్తు ఆర్డర్ మేరకు సాదాసీదాగా వంటా-వార్పు చేసి రవాణాకు వీలుగా కుండల్లో పేర్చి విక్రయిస్తున్నట్లు తెలిసింది. అయితే వాస్తవం బయటపడడంతో ఈ వర్గీయులు పరారయ్యారు. నకిలీ మహాప్రసాదాల విక్రయాలపై వార్తలు ప్రసారం కావడంతో పలువురు జగన్నాథ ఆలయం పాలకమండలి సభ్యులు ఆయా ప్రాంతాలను సందర్శించారు. స్వామి ప్రసాదాల పేరిట అమాయక భక్తజనాన్ని మోసం చేయడం అత్యంత అపచారమని ఆవేదన వ్యక్తం చేశారు.

చర్యలు చేపట్టాలి..

స్వామి ప్రసాదాల తయారీ సేవాయత్ వర్గం సువార్-మహా సువార్ సేవకులు ఈ ప్రక్రియ పట్ల స్పందించి సత్వర నివారణ చర్యలకు నడుం బిగించాలని కోరారు. దేవస్థానం అధికార వర్గాలు ఈ విషయం పట్ల ఘాటుగా స్పందించాల్సి ఉందన్నారు. బూటకపు వ్యక్తులు స్వామి అన్నప్రసాదం తరహాలో అన్నం, పప్పు, బెసార్, కలగూర ఇతరేతర అనుబంధ వంటకాలతో మట్టి కుండల్లో అమర్చి భక్తులను బురిడీ కొట్టిస్తున్నట్లు దాడుల్లో తేలింది. అయితే పరారీ ముఠాని అదుపులోకి తీసుకుని తదుపరి చర్యలు చేపట్టాల్సి ఉంది. సత్వర చర్యలతో నకిలీ ప్రసాదాల తయారీ, క్రయ విక్రయాలకు కళ్లెం వేయడంతో అమాయక భక్తులు మోసపోకుండా సహకరించినట్లు అవుతుందని సర్వత్రా ఏకాభిప్రాయం వ్యక్తమవుతోంది.

తెరమరుగున సేవలు..

దేవస్నాన పూర్ణిమ పురస్కరించుకుని భారీస్నానం ఆచరించిన స్వామి స్వల్ప అస్వస్థతకు గురై, తెర మరుగున గోప్య సేవలు పొందుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్వామివారికి అన్న ప్రసాదాలు నివారించి పత్యపు నైవేద్యాలతో గోప్య ఉపచారాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీమందిరం ప్రాంగణం ఆనంద బజార్‌లో నిత్యం లభించే అన్న ప్రసాదాలు లభించడం లేదు. ఈ విషయం తెలియని భక్తులు, యాత్రికులు స్వామివారి అన్న ప్రసాదాల కోసం ఆరాటపడుతున్న బలహీన క్షణాలను కొంతమంది సొమ్ము చేసుకుంటున్నారు. మోసపూరితంగా జగన్నాథుని ఒభొడా తరహాలో సాధారణ వంటకాలను మట్టి కుండల్లో అమర్చి, మహా ప్రసాదంగా విక్రయిస్తున్నారు. శ్రీమందిరం నుంచి కొంచెం దూరంలో పలు వీధుల్లో ఈ వీరంగం జరుగుతున్నట్లు పొక్కడంలో అనుబంధ వర్గాలు శుక్రవారం ఆకస్మికంగా దాడి చేశాయి. దీంతో నకిలీ ఒభొడా తయారీదారుల ముఠా పరారైంది.



అశుభ సంకేతం!

పూరీ జగన్నాథ మందిరం శిఖరంపై నిత్యం పతిత పావన పతాకం రెపరెపలాడుతుంది. అల్లంత దూరం నుంచి ఈ పతాకాన్ని దర్శించుకున్నా మోక్షం లభిస్తుందని భక్తుల విశ్వాసం. ఆలయ శిఖరంపై నీలచక్రం ఆధారంతో దీనిని ఏర్పాటు చేస్తారు. ఈ పరిసరాల్లో పక్షాదులు సంచరించవు. ఈ నేపథ్యంలో విమానాల వంటివాటి సంచారం నివారణకు వీలుగా నో ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించారు. ఈ పరిస్థితుల్లో నీలచక్రంపై అమర్చిన పతిత పావన పతాకంపై శుక్రవారం పక్షి వాలింది. చాలాసేపు పతాకంపై స్థిరంగా కూర్చుని ఉన్న దృశ్యం పలువురు ప్రత్యక్షంగా తిలకించారు. ఇదో అపచార ఘటనగా భావిస్తున్నారు. పలువురు స్థానిక వయోవృద్ధులు ఇటువంటి దృశ్యం ఎన్నడూ చూడలేదని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా సేవాయత్ వర్గంలో కొందరు దీనిని అశుభ సంకేతంగా వ్యాఖ్యానించడంతో సర్వత్రా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



పతిత పావన పతాకంపై నిలిచి ఉన్న పక్షి

మద్యం దుకాణాలు బంద్

• రేపటి నుంచి పూరీలో ఎక్సైజ్ కంట్రోల్ రూమ్ ప్రత్యేక నిఘా



భువనేశ్వర్: జగన్నాథుని రథయాత్ర పురస్కరించుకుని పూరీ పట్టణ పరిసర ప్రాంతాల్లో మద్యం దుకాణాలు మూసివేతకు ఆదేశాలు జారీ అయ్యాయి. రథయాత్రకు ఒకరోజు ముందు నుంచే ఈ ప్రాంతంలో మద్యం క్రయవిక్రయాల నివారణకు ఈ చర్యలు చేపట్టడం విశేషం. ఈ నేపథ్యంలో ఈనెల 18 అర్ధరాత్రి నుంచి దుకాణాలకు సీల్ వేసేందుకు ఆదేశించినట్లు జిల్లా ఎక్సైజ్ విభాగం తెలిపింది. పూరీ సహా పరిసర ప్రాంతాల్లో సమగ్రంగా 34మద్యం దుకాణాలు మూసేందుకు చర్యలు చేపడుతున్నారు. మరోవైపు యాత్ర ఆద్యంతాలు పరిసరాల్లో ఇతరేతర మాదక ద్రవ్యాల క్రయవిక్రయాల నివారణకు నడుం బిగించారు. ఈ సందర్భంగా పూరీ కార్యాలయంలో ప్రత్యేకంగా కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశారు. మద్యం దుకాణాల మూతతో పాటు గంజాయి, బ్రౌన్ షుగర్ వంటి మాదక ద్రవ్యాల విక్రయాల నివారణ పట్ల ఈ యంత్రాంగం ప్రత్యేకంగా నిఘా వేస్తుందన్నారు. శ్రీమందిరం నుంచి రథాలు గుండిచా మందిరం ఆవరణకు చేరేంత వరకు ఈ ఆంక్షలు కొనసాగుతాయని తెలపారు. అలాగే మారు రథయాత్ర బహుడా పురస్కరించుకుని మరోసారి మద్యం దుకాణాల మూసి వేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 26న అర్ధరాత్రి నుంచి మరోసారి దుకాణాలు మూయాలని ఆదేశాల్లో స్పష్టం చేశారు. రథాలపై మూల విరాట్‌ల స్వర్ణాలంకారంతో దర్బారు సేవ ముగిసేంత వరకు ఈ ప్రక్రియ నిరవధికంగా కొనసాగుతుందని వివరించారు.

సూపరింటెండెంట్ సామల్ నేతృత్వంలో..

జిల్లాలో అక్రమ మాదక ద్రవ్యాల వ్యాపారంపై నిఘా పెట్టేందుకు జిల్లా ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో అబ్కారీ బ్యారక్‌లో కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించారు. ఈ 24 గంటల(రాత్రింబవళ్లు) కంట్రోల్ రూమ్ ఈనెల 30వరకు కొనసాగుతుంది. జిల్లా ఎక్సైజ్ భాగం సూపరింటెండెంట్ జగదీష్‌చంద్ర సామల్ నేతృత్వంలో రెండు బృందాలతో ప్రత్యేక గస్తీ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. అక్రమ మద్యం, భాంగ్, గంజాయి, బ్రౌన్ షుగర్ విక్రయాలను అరికట్టే దిశలో ఈ యంత్రాంగం కృషి చేస్తుంది. సూపరింటెండెంట్ సామల్ నేతృత్వంలో, ఇన్‌స్పెక్టర్లు మాన్సీ సాహు, పార్థసారథి రౌత్, ఆరుగురు సబ్ ఇన్‌స్పెక్టర్లు, 13మంది సహాయ సబ్ ఇన్‌స్పెక్టర్లు, 29మంది కానిస్టేబుళ్లతో సహా 4 బృందాలను ఏర్పాటు చేశారు. వీరంతా కంట్రోల్ రూమ్ ఆధీనంలో 24 గంటలూ పెట్రోలింగ్, తనిఖీల విధులు నిర్వహించారు. ప్రధానంగా రాత్రి వేళల్లో సత్‌పడా, జగన్నాథ సడక్ రామేశ్వర్, పిపిలి మార్గంలో ఉత్తరా ఛక్ తదితర ప్రధాన రహదారుల్లో ఈ బృందం గస్తీ తిరుగుతుంది.

ఘాట్ రోడ్డులో ఘోర ప్రమాదం



ప్రమాదంలో ఛిద్రమైన లారీ



ఘటనా స్థలంలో పడి ఉన్న మహిళలు

జయపురం: జయపురం-కొరాపుట్ 26వ నంబర్ జాతీయ రహదారిలో శుక్రవారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో ఇద్దరు మహిళలు మృతిచెందినట్లు సమాచారం. అయితే ప్రమాదానికి గల కారణాలు, మృతుల వివరాలు ఇంకా తెలియలేదు. జయపురం సమితి బరిణిపుట్ గ్రామానికి కొద్ది దూరంలోని ఘాట్ రోడ్డులో బొగ్గు రవాణా చేస్తున్న లారీ-స్కూటీ ఢీకొడంతో ప్రమాదం జరిగినట్లు సమచారం. స్కూటీపై ప్రయానిస్తున్న మహిళలిద్దరూ తీవ్రంగా గాయపడగా, బరిణిపుట్ ఔట్‌పోస్ట్ పోలీసులు జయపురం జిల్లా కేంద్రా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ప్రకటించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మరో 4రోజులు వడగాలులు



బరంపురం: ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రహదారి

• హెచ్చరికలు జారీచేసిన భారత వాతావరణ శాఖ

భువనేశ్వర్: రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో మరో నాలుగు రోజులు వేడి వాతావరణం, వేడి గాలులు ఉంటుందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) ప్రాంతీయ కార్యాలయం అధికారులు శుక్రవారం వెల్లడించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పగటిపూట గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో పెద్ద మార్పు ఉండదని తెలిపారు. మరికొన్ని చోట్ల ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయని పేర్కొన్నారు. కొన్ని చోట్ల గరిష్ఠ ఉష్ణోగ్రత సాధారణం కంటే 4 డిగ్రీల సెల్సియస్ నుంచి 7 డిగ్రీల సెల్సియస్ వరకు అధికంగా ఉంటుందని ముందస్తు హెచ్చరిక జారీ చేశారు. దీంతో రానున్న 4, 5 రోజుల్లో వేడి, అసౌకర్య వాతావరణం నెలకొంటుందన్నారు. ప్రజలు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల మధ్య బయటికి వెళ్లేవారు వేడికి గురికాకుండా జాగ్రత్త వహించడం, వడదెబ్బ నివారణకు చర్యలు చేపట్టడం వంటివి చేయాలని ఐఎండీ ప్రత్యేకంగా సూచించడం విశేషం.

వడగాడ్పుల హెచ్చరిక

కెంజొహర్, మయూర్‌భంజ్, అంగుల్, ఢెంకనాల్, ఝార్సుగుడ, సుందర్‌ఘడ్, సంబల్‌పూర్, బర్‌గఢ్, దేవ్‌గఢ్, సోన్‌పూర్, బౌధ్, బొలంగీర్, కటక్, ఖుర్దా, నయాఘడ్, నువాపడా, కలహండి, కంధమాల్, గంజాం, బాలాసోర్, భద్రక్, కేంద్రపడా, జాజ్‌పూర్, జగత్‌సింగ్‌పూర్, పూరీ జిల్లాల్లో కొన్ని చోట్ల వేడిగాలుల తీవ్రత అధికంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో జిల్లాలకు ఐఎండీ ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసింది. శనివారం వరకు ఈ హెచ్చరిక తీవ్రంగా ఉంటుందని ఐఎండీ స్పష్టం చేసింది.

రథయాత్రపై సన్నాహక సమావేశం



సమావేశంలో పాల్గొన్న అధికారులు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలో ఈనెల 20న జరగనున్న రథయాత్రకు సంబంధించి కలెక్టర్ విశాల్ సింగ్ ఆదేశాల మేరకు సబ్ కలెక్టర్ అక్షయ్‌కుమార్ ఖెముండు కార్యలయం సన్నామక సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ నేపథ్యంలో స్థానిక దుర్గాగుడి వీధిలోని జగన్నాథ మందిరం నుంచి గుండిచా మందిరం వరకు జగన్నాథ దేవతామూర్తులతో రథయాత్ర చేపట్టనున్నారు. ఇందులో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా మద్యం దుకాణాలు మూసి వేయాలని, ప్రతి కూడలి వద్ద థాగునీరు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ అశోక్ చక్రవర్తి, తహసీల్దార్ సహిద్ సబీర్, అదనపు ఎస్పీ సచిన్ పటేల్, డీపీఆర్‌ఓ ప్రమీలా మాఝి పాల్గొన్నారు.

ఆ బ్యాగ్‌లో ఏముంది?

• కలెక్టర్ కార్యాలయం సమీపంలో బ్యాగ్ విడిచి వెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులు



బ్యాగ్‌ను తనిఖీ చేస్తున్న పోలీసులు

రాయగడ: జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయానికి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు వదిలి పెట్టిన బ్యాగ్ అందరినీ భయాందోళనకు గురి చేసింది. దీనిని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, డాగ్ స్క్వాడ్ సాయంతో తనిఖీలు నిర్వహించారు. వివరాల్లోకి వెళ్తే... గురువారం సాయంత్రం బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని యువకులు కలెక్టర్ కార్యాలయం మెయిన్ గేట్‌కు సమీపంలో నల్లరంగు బ్యాగ్‌ను విడిచి వెళ్లిపోయారు. గంటలు తరబడి బ్యాగ్ అక్కడే పడి ఉండటాన్ని గమనించిన చుట్టుపక్కల వారు.. విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. ఈ నేపథ్యంలో జాగిలాలు, సైంటిఫిక్ బృందం అక్కడికి చేరుకొని, బ్యాగ్‌తో పాటు పరిసర ప్రాంతాలను తనిఖీ చేశారు. ఇందులో భయాందోళన చెందాల్సినంతగా ఏమీ లేదని తేలడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఆ బ్యాగ్‌ను ఎందుకు అక్కడ విడిచి పెట్టారనే సందేహం చర్చనీయాంశంగా మారింది. దీనిపై రాయగడ ఐఐసీ కమలాకాంత్ కుహొరా మాట్లాడుతూ సమాచారం అందిన వెంటనే సిబ్బందితో అక్కడికి వెళ్లి పరిశీలించామని, ఏమీ లేదని తేలడంతో తిరిగి వచ్చామని తెలిపారు. అయితే బ్యాగ్‌లో ఏఏ వస్తువులు ఉన్నాయన్న ప్రశ్నకు మాత్రం ఆయన సమాధానం చెప్పలేదు.

వంట సహాయకులకు తగిన గుర్తింపు

• రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు



ప్రసంగిస్తున్న మాజీ ఎంపీ నెక్కంటి, వేదికపై సంఘం నాయకులు

రాయగడ: మధ్యాహ్న భోజనం పథకం వంట సహాయకుల కష్టాన్ని ప్రభుత్వం ఎప్పుడూ గుర్తిస్తుందని, వారి డిమాండ్లు, సమస్యలను ఒకొక్కటిగా పరిష్కరిస్తుందని రాజ్యసభ మాజీ ఎంపి నెక్కంటి భాస్కరరావు భరోసా ఇచ్చారు. జిల్లా కేంద్రంలోని టక్కర్ బప్పా ఆశ్రమం ప్రాంగణంలో అఖిల ఒడిశా వంట సహాయకుల మహాసంఘం ఏర్పాటు చేసిన కృతజ్ఞతా సమావేశానికి ఆయన శుక్రవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర నలుమూలలా పాఠశాలల్లోని పిల్లలకు మధ్యాహ్న భోజన పథకం ద్వార వంట-వార్పు చేసి, విద్యార్థుల ఆకలి తీర్చే ఎంతోమంది తల్లుల రుణం తీర్చుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఆ దిశగా ఇప్పటికే 36నెలల వేతన బకాయిలను చెల్లించేందుకు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రకటించారని తెలిపారు. ప్రజల ఆదరాభిమానాలతో గత 2దశాబ్దాలకు పైగా రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్న బీజేడీ ఎప్పుడూ ప్రజల బాగోగుల విషయమై యోచిస్తుందన్నారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా నవీన్ సర్కార్ స్వచ్ఛమైన పాలన అందించేందుకు నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్రశాఖ అధ్యక్షుడు జోగేందర్ స్వాయి మాట్లాడుతూ వంటవారి బాధలు ప్రభుత్వం ఇన్నాళ్లకు గుర్తించడం హర్షించదగ్గ విషయమన్నారు. మిగతా డిమాండ్లను కూడా నెరవేర్చే దిశగా కృషి చేయాలని కోరారు. అదేవిధంగా సిబ్బందిని నాలుగో తరగతి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు నెలకు రూ.9,930ల వేతనం ఇవ్వాలని, ఆరోగ్య, జీవిత బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్రశాఖ సహాయ కార్యదర్శి సురేంద్ర, జిల్లా అధ్యక్షురాలు సంధ్యారాణి బారిక్, వివిధ ప్రాంతాల నుంచి వంట సహాయకులు పాల్గొన్నారు.

సంస్కృతిని అంతా పరిరక్షించాలి

- రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక
- సందడిగా ముగిసిన రొజ్జొ సంక్రాంతి వేడుకలు


కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు, యువతులు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న మంత్రి జగన్నాథ సరక

రాయగడ: మన భాష, కళ, సంస్కృతులను పరిరక్షించుకోవడం తోపాటు భావితరాలకు మార్గదర్శకులుగా నిలవాలని రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సంస్కృతి మహిళా సంస్థ ఆధ్వర్యంలో గత 3రోజులుగా కొనసాగుతున్న రొజ్జొ సంక్రాంతి వేడుకలు శుక్రవారం ముగిసాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఒడియా సంస్కృతిని భావితరాలకు అందించే విధంగా ప్రతి పండుగను జరుపుకోవాలని సూచించారు. రొజ్జొ వంటి వేడుకలు మహిళల మానసిక వికాశానికి ఎంతగానో దోహద పడతాయన్నారు. నేటి ఆధునిక యుగంలో ఇటువంటి కార్యక్రమాలను బాధ్యతగా నిర్వహించేందుకు ముందుకు వస్తున్న మహిళా సంస్థలను అభినందించాలని అభిప్రాయం వ్యక్తంచేశారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా అదనపు ఎస్పీ విష్ణుప్రసాద్ పాత్రొ, రాయగడ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ బాబిలత హాజరయ్యారు. ఈ సందర్భంగా సంస్కృతి వార్షిక నివేదికను సంస్థ కార్యదర్శి సరస్వతి సాహు వివరించగా, అధ్యక్షురాలు సుజాత పాలొ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా ముగిశాయి. ఇందులో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు మంత్రి సరక బహుమతులను అందజేశారు.

ఆకట్టుకున్న నృత్యాలు..

పర్లాకిమిడి: రొజ్జొ ఉత్సవం చివరి రోజు పట్టణంలోని ప్రగతి మహిళా సంఘటన్ ఆధ్వర్యంలో నృత్య, పిండివంటల పోటీలు నిర్వహించారు. స్థానిక గజపతి ప్యాలెస్‌లోని యూటెక్ కంప్యూటర్స్ కార్యాలయంలో గృహిణులు వివిధ రకాల పిండి వంటలతో తమ పాకశాస్త్ర నైపుణ్యాన్ని ప్రదర్శించారు. పలువురు యువతులు నృత్యాలు చేసి, ఆకట్టుకున్నారు. న్యాయనిర్ణేతలుగా బిచిత్రానందా బెబర్తా, ప్రగతి మహిళా సంఘటన్ కార్యదర్శి తనూజా శత్పతి, భాగవత్ పాఢి, నృసింహ గౌడొ వ్యవహరించారు. అలాగే అమ్మాయిలు ఊయల ఊగి, పాటలు పాడారు. స్థానిక సరస్వతీ శిశు విద్యామందిరం భవనంలో అంజనీ పట్నాయక్ రచించిన సృష్టి బొర్నాలి అనే సాహితీ పుస్తకాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ నిర్మలా శెఠి, అరవింద పండా, ఒడిశా సాహిత్య అకాడమీ సభ్యులు బిచిత్రానంద బెబర్తా, మహంత రామానంద దాస్, నృసింహచరణ్ పట్నాయక్ తదితరులు ఆవిష్కరించారు.


పర్లాకిమిడి: బొర్నాలి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నిర్మలాశెఠి


పర్లాకిమిడి: నృత్యాలతో ఆకట్టుకుంటున్న చిన్నారి


పర్లాకిమిడి: పోటీల్లో పాల్గొన్న మహిళలు

క్లుప్తంగా

వేసవి సెలవులు పొడిగింపు

భువనేశ్వర్: రాష్ట్రంలో ఎండ తీవ్రత వేధిస్తోంది. ఈ నేపథ్యంలో వడదెబ్బ నివారణ దృష్ట్యా పాఠశాల విద్యార్థులకు వేసవి సెలవులు పొడిగించారు. రాష్ట్రప్రభుత్వం, జాగ్రత్తగా పరిశీలించిన మేరకు, ప్రస్తుత వేసవి సెలవులు ముగిసిన తరువాత ఈనెల 21నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలను తిరిగి తెరవాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి పాఠశాల, సామూహిక విద్యాశాఖ అదనపు కార్యదర్శి దుర్గాప్రసాద్ మహాపాత్ర శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వాస్తవానికి సెలవులు ఈనెల 17(నేటి)తో ముగియాల్సి ఉంది. రాష్ట్రంలో వేడిగాలుల పరిస్థితుల దృష్ట్యా ఈ నిడివి పొడిగించారు. ఈ ఏడాది ఏప్రిల్ 21నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు కొనసాగుతున్న విషయం తెలిసిందే.

అటవీ కలప స్వాధీనం


అటవీశాఖ సిబ్బంది స్వాధీనం చేసుకున్న కలప

కొరాపుట్: అటవీ కలప అక్రమ విక్రమాలను అటవీశాఖ సిబ్బంది అడ్డుకున్నారు. కొరాపుట్ జిల్లా కేంద్రం మీదుగా అటవీ కలప స్మగ్లింగ్ అవుతుందనే సమాచారంతో సిబ్బంది శుక్రవారం తనిఖీలు చేపట్టారు. అతివేగంగా ప్రయాణిస్తున్న కారును నిలువరించేందుకు సిబ్బంది ప్రయత్నించారు. అయితే వాహనాన్ని ఆపక పోవడంతో వెంబడించి లంకాపుట్ జంక్షన్ వద్ద పట్టుకున్నారు. అప్పటికే డ్రైవర్ కారును వదలి పరారయ్యాడు. ఇందులో అడవి నుంచి అక్రమంగా నరికి, తరలిస్తున్న 20 పనస దుంగలను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో కొరాపుట్‌కు చెందిన నాగేశ్వర్ ప్రధాన్ వాహనాన్ని మహేశ్వర్ కిరా కొనుగోలు చేసినట్లు తేలింది. కిరానే కలపను అక్రమంగా తరలిస్తున్న అనుమానిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ కార్యాలయం ముట్టడి


ఆందోళన నిర్వహిస్తున్న బీజేపీ కార్యకర్తలు

కొరాపుట్: భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు విద్యుత్‌శాఖ కార్యాలయాన్ని ముట్టడించారు. నవరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని చమిరియాగుడ విద్యుత్‌శాఖ కార్యనిర్వాహణ అధికారి కార్యాలయం వద్ద శుక్రవారం ఆందోళనకు దిగారు. రాష్ట్రంలో విద్యుత్ కోతలు ఉండవని ప్రభుత్వం ప్రకటినా.. జిల్లాలో సమస్య తీవ్రంగా ఉందన్నారు. ముందస్తు ప్రకటన లేకుండా అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తున్నారని ఆరోపించారు. ఠంచన్‌గా వినియోదారుల నుంచి విద్యుత్ బిల్లులు వసూలు చేసే సిబ్బంది.. నాణ్యమైన సరఫరా అందించడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ తీరు మారాలని హితవు పలికారు. ఆందోళనలో నాయకులు గౌరీశంకర్ మాఝి, దేవదాస్ మహంకుడొ, షర్మిష్టా దేవ్, మానస్‌పాత్రొ తదితరులు పాల్గొన్నారు.

5 వ్యాన్‌ల సీజ్



బొండపల్లి: మండలంలోని జాతీయ రహదారి26 మీదుగా 5 బొలెరో వ్యాన్‌లలో పశువులను తరలిస్తుండగా పోలీసులు 5 వ్యాన్‌లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వివరాలి లా ఉన్నాయి. పార్వతీపురం నుంచి మూడు వ్యాన్‌ల్లోను, అలాగే మానాపురం నుంచి రెండు వ్యాన్‌లలో 35 పశువులను అక్రమంగా తరలిస్తుండగా శుక్రవారం పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై ఎస్.రవి తెలిపారు. ఈమేరకు వ్యాన్ డ్రైవర్లను అదుపులోనికి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నిద్ర లేపినందుకు ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న ఆశ

పార్వతీపురం: నిద్రిస్తున్న తనను తల్లి లేపినందుకు కుమార్తె మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నం చేసింది. శుక్రవారం జరిగిన ఈ సంఘటనపై పార్వతీపురం ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని రెల్లివీధికి చెందిన ఎస్.ఆశ ఉదయం ఎనిమిది గంటలైనా నిద్రనుంచి లేవక పోవడంతో తల్లి సుజాత తిట్టి లేపింది. అందుకు కుమార్తె చిరాకు పడడంతో పాటు మనస్తాపం చెంది ఇంట్లో ఉన్న చీమల మందును తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. దీన్ని గమనించిన తల్లి కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు వచ్చి ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పట్టుబడిన దోపిడి దొంగలు


పోలీసుల అదుపులో నిందితులు


స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు, నగదు

- 167 గ్రాముల బంగారం, రూ.62వేల నగదు స్వాధీనం

బరంపురం: గంజాం జిల్లా సురడా పోలీసు స్టేషన్ పరిధి మెయిన్ రోడ్డులో ఉన్న వెరైటీ స్టోర్, ఓ నివాసంలో ఇటీవల జరిగిన చోరీలకు సంబంధించి పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించి సురడా ఐఐసీ అధికారి ఉమాశంకర్ సింగ్ శుక్రవారం తెలిపారు. ఈనెల 11న సురడా మెయిన్ రోడ్డులోని వెరైటీ స్టోర్, ఇంట్లోకి చొరబడిన దుండగులు బంగారం, నగదు దోచుకొని, పరారయ్యారు. ఈ నేపథ్యంలో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. ముగ్గురు అనుమానితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి 167 గ్రాముల బంగారు భరణాలు, కారు, బైక్, 4 సెల్ ఫోన్లు, 2 బొమ్మ తుపాకీలు, చాకు, రూ.62,925 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు గంజాం జిల్లా కరియాగుడ గ్రామానికి చెందిన సుదర్శన్ గౌడా(24), సనాతన్ గౌడా(23), ఉమాచరన్ గౌడా(23)గా గుర్తించామని ఐఐసీ వివరించారు.

ఉద్యోగుల వినూత్న నిరసన


మిఠాయిలు తయారు చేస్తున్న మహిళా సిబ్బంది


టీ, పకోడి విక్రయిస్తున్న ఉద్యోగులు

మల్కన్‌గిరి: తమ డిమాండ్ల పరిష్కారం కోరుతూ గత 16రోజులుగా నిరవధిక సమ్మె కొనసాగిస్తున్న అమలా సంఘం ఉద్యోగులు.. శుక్రవారం వినూత్నం నిరసన చేపట్టారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించి, టీ, పకోడి, మిఠాయిలి విక్రయ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఉద్యోగులకు రూ.4,200 నుంచి రూ.9,300లకు డీఏ పెంపుదల చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో సిబ్బందికి టీ, పకోడీ పెట్టుకోక తప్పదని విచారం వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. నిరసనలో అమలా సంఘం ప్రతినిధులు శ్యామ్‌సుందర్ నాయక్, లక్ష్మీనారాయణ దాస్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లతో ఎస్సై హరిబాబు నాయుడు

గుర్ల: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను మండలంలోని ఆనందపురం వద్ద ఎస్సై హరిబాబు నాయుడు శుక్రవారం పట్టుకున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలించడంతో ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఈ మేరకు ఎస్సై తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామని అక్రమంగా ఇసుక తరలించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

జేసీబీ, రెండు ట్రాక్టర్ల పట్టివేత

వీరఘట్టం: అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్న వారిపై మైనింగ్‌శాఖ అధికారులు శుక్రవారం దాడులు చేసి మట్టి తవ్వుతున్న జేసీబీ, మట్టితో ఉన్న రెండు ట్రాక్టర్లు పట్టుకుని సీజ్ చేశారు. వీరఘట్టం మండలం కడకెల్ల వద్ద పొలం మట్టిని ఇటుక బట్టీలకు తరలిస్తున్న విషయం తెలుసుకున్న పార్వతీపురం మన్యం జిల్లా మైన్స్ ఎ.డి శ్రీనివాసరావు,టెక్నికల్ అసిస్టెంట్ హరిబాబులు అడ్డుకున్నారు. ట్రాక్టర్ల యజమానులపై కేసులు నమోదు చేసి ట్రాక్టర్లను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు.

స్నేహమంటే ఇదేరా..!

అలల ప్రయాణం తీరం చేరేంత వరకు మాత్రమే. కలల ప్రయాణం నిద్ర లేచేంతవరకు మాత్రమే. ప్రేమ ప్రయాణం పెళ్లి జరిగేంత వరకు మాత్రమే. కానీ స్నేహబంధం ప్రాణం పోయేంత వరకు అని నిరూపించారు ఈ ప్రాణస్నేహితులు. నెల్లిమర్ల మండలం సారిపల్లి గ్రామానికి చెందిన ప్రాణ స్నేహితులు 24 గంటల వ్యవధిలో మృతిచెందారు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి.

- 24 గంటల వ్యవధిలోనే ప్రాణ స్నేహితుల మృతి


సారిపల్లి చిట్టిబాబు(ఫైల్)


బోనుమహంతి నరసింగరావు(ఫైల్)

నెల్లిమర్ల: వారిద్దరూ ప్రాణ స్నేహితులు. ఊహ తెలిసిన నాటి నుంచి ఆధ్యాత్మిక సేవలోనే గడిపారు. కలిసి భజనలు చేసి పాటలు పాడారు. ఇద్దరిలో ఒకరు అనారోగ్యంతో చనిపోయిన 24 గంటల్లోగానే రెండో వ్యక్తి మృతిచెందాడు. సారిపల్లి గ్రామానికి చెందిన సారిపల్లి చిట్టిబాబు(70), బోనుమహంతి నరసింగరావు(70) ఊహ తెలిసిన నాటి నుంచి గ్రామంలో ఆధ్యాత్మిక సేవలను అందిస్తూ వచ్చారు. శ్రీరామకృష్ణ మఠం స్థాపనలో ఇద్దరి కృషి అభినందనీయం. గ్రామంతో చుట్టుపక్కల ఎక్కడ ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగినా చురుగ్గా పాల్గొనేవారు. భక్తి పాటలు పాడడం, ప్రసంగాలు చేయడంలో ఇద్దరికీ మంచి పేరుంది. వినాయక ఉత్సవాలు, దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో వీరి ఆధ్యాత్మిక సేవ ప్రశంసనీయం. ఈ నేపథ్యంలో చిట్టిబాబు అనారోగ్యానికి గురికావడంతో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. మిత్రుడి మరణవార్త విన్న క్షణం నుంచి నరసింగరావు కూడా కలత చెందాడు. మిత్రుడి మరణ వార్త ఆయనను మానసికంగా కుంగదీసింది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 6 గంటల సమయంలో ఆయన కూడా మృతిచెందాడు. ప్రాణస్నేహితులు ఇద్దరూ 24 గంటల వ్యవధిలోనే మృతిచెందడంతో గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. మరణంలోనూ వారు స్నేహం వీడిపోలేదని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

విశాఖలో అంతర్ జిల్లా న్యాయవాదుల క్రికెట్ టోర్నీ

విజయనగరం లీగల్: అంతర్ జిల్లా న్యాయవాదుల క్రికెట్ టోర్నీకి జిల్లా న్యాయవాదుల సంఘానికి చెందిన 16 మంది క్రీడాకారులు శుక్రవారం విశాఖ బయల్దేరారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.కల్యాణచక్రవర్తికి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చొక్కాపు దాము క్రీడాకారులను పరిచయం చేశారు. కేవలం వృత్తికే పరిమితం కాకుండా మానసిక ఉల్లాసానికి క్రీడల్లో పాల్గనాలని ప్రధానన్యాయమూర్తి వారికి సూచిస్తూ టోర్నీలో విజయం సాధించాలని ఆకాంక్షించారు.విశాఖ జిల్లా న్యాయవాదుల సంఘం నిర్వహిస్తున్న ఆహ్వాన పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల జట్లు తలపడనున్నాయి.జిల్లా కేంద్రం నుంచి ఎల్.శంకర రావు కెప్టెన్సీలో 13 మంది క్రీడకారులతో పాటు సంఘం అధ్యక్షుడు చొక్కాపు దాము, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శి పాడుగుకుమార్ వెళ్లారు.

పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

గంట్యాడ: పశు బీమా పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ విశ్వేశరరావు అన్నారు. మండలంలోని గింజేరు గ్రామంలో పశుబీమా పథకంపై పాడి రైతులకు శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు, దుక్కిదున్నే పశువులకు బీమా చేసుకోవచ్చునని తెలిపారు. తెల్లకార్డు కలిగిన రైతులకు 80 శాతం రాయితీ, తెల్లకార్డు లేని వారికి 50 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు చెప్పారు. వ్యాధి వల్ల, ప్రమాదం, ప్రకృతి వైపరీత్యాల వల్ల చనిపోయిన పశువులకు బీమా పొందవచ్చునని తెలిపారు. పశువులకు చికిత్స కోసం వైఎస్సార్ సంచార పశు వైద్యశాలను వినియోగించుకోవాలని సూచించారు. పశువుల చికిత్స కోసం టోల్ ఫ్రీ నంబర్ 1962ను సంప్రదించాల న్నారు. కార్యక్రమంలో డీడీ వై.వీ.రమణ, పాల్గొన్నారు.

అరటి తోటలో మృతదేహం


తోటలో గొర్రెల కాపరి మృతదేహం

దత్తిరాజేరు: మండల కేంద్రం దత్తిరాజేరు గ్రామ సమీపంలో ఉన్న అరటి తోటలో మెంటాడ మండలం పెదమేడపల్లి గ్రామానికి చెందిన గొర్రెల కాపరి కోన సింహచలం(49) మృతదేహం లభ్యమైనట్లు పెదమానాపురం ఎస్సై జి.శిరీష తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఎస్సై మాట్లాడుతూ దత్తి వెంకటాపురం గ్రామానికి చెందిన గొర్రెల యజమాని గడిదేశి సూరయ్య వద్ద ఏడాదిగా సింహాచలం పని చేస్తున్నాడని, ఈనెల 14వ తేదీ నుంచి కనిపించక పోవడంతో కుటుంబసభ్యులకు యజమాని సమాచారం అందించి ఎక్కడున్నాడో తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. శుక్రవారం మధ్యాహ్నం అరటి తోటలో మృతదేహం ఉందని స్థానికులు సమాచారం అందించడంతో వెళ్లి మృతదేహన్ని బయటకు తీసి గజపతినగరం సామాజిక ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. మద్యం మత్తులో మృతి చెందాడా? ఇతర కారణాలతో మృతి చెందాడా? తెలియాల్సి ఉందన్నారు.మృతుడి కుమారుడు సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.


లక్ష్మునాయుడు (ఫైల్)

చికిత్స పొందుతూ ఉపసర్పంచ్..

బొబ్బిలి: మండలంలోని అలజంగి గ్రామ ఉపసర్పంచ్ పొట్నూరు లక్ష్మునాయుడు (65) విజయనగరంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. గురువారం ఉదయం క్రిమి సంహారక మందు తాగిన లక్ష్మనాయుడిని కుటుంబ సభ్యులు విజయనగరం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందారు. ఆయనకు భార్య సత్తెమ్మ, బ్యాంకుల్లో ఉద్యోగాలు చేస్తున్న ఇద్దరు కుమారులు, అమెరికాలో ఉంటున్న కుమార్తె ఉన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాల నాయుడు మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు.

ఆర్మీలో కొలువు సాధించాలి

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు


అభ్యర్థులకు టీ షర్టులు పంపిణీ చేస్తున్న దృశ్యం

విజయనగరం: అగ్నివీర్ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం జిల్లా వేదికగా నిర్వహిస్తున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన అభ్యర్థులు కొలువులు సాధించాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. వచ్చే నెలలో పోలీస్ ట్రెనింగ్ కళాశాల మైదానంలో నిర్వహించే ర్యాలీలో పాల్గొనబోయే అభ్యర్థులకు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సెట్విజ్ ఆధ్వర్యంలో నిర్వహించే శిబిరంలో పాల్గొనే అర్హులైన అభ్యర్థులకు శుక్రవారం ఆయన ప్రదీప్ నగర్‌లో గల తన క్యాంప్ కార్యాలయంలో ఉచితంగా టీ షర్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా అభ్యర్థులు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీని చక్కటి వేదికగా వినియోగించుకోవాలని సూచించారు. సెట్విజ్ సీఈఓ బి.రామ్ గోపాల్ మాట్లాడుతూ ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ శిబిరం నిర్వహణకు జిల్లా పరిషత్ నుంచి రూ.5 లక్షల నిధులు కేటాయించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో శిక్షకులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

ఒడిశా రైతులకు శిక్షణ

- చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తులపై అవగాహన


రస్తాకుంటుబాయి కేవీకేలో నిర్వహించిన శిక్షణలో పాల్గొన్న ఒడిశాకు చెందిన గిరిజన రైతులు

గుమ్మలక్ష్మీపురం/కురుపాం: కురుపాం మండలంలోని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం (ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం)లో ఒడిశాకు చెందిన 30 మంది గిరిజన రైతులకు (ఒడిశా మిల్లెట్ మిషన్ ఆధ్వర్యంలో) చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెల 12న చేపట్టిన శిక్షణ శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ టీఎస్ఎస్‌కే పాత్రో మాట్లాడుతూ శిక్షణలో కేవీకే ముఖ్య ఉద్దేశాలు, కేవీకేలో ఉన్న డెమో యూనిట్లపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. అలాగే వివిధ రకాల చిరుధాన్యాల (కొర్ర, సామ, ఊద,అరిక, అండు కొర్రలు, రాగులు) పంటల సాగుతో ప్రయోజనాలు, పంటల సాగులో వచ్చే తెగుళ్లు, వాటి నివారణ చర్యలపై క్షుణ్ణంగా తెలియజేశామన్నారు. అలాగే చిరుధాన్యాలతో సుమారు 15 రకాల విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.ప్రవంతి, డాక్టర్ ఎం.అనంత విహారి, డాక్టర్ జి.అను, వై. ఉమాజ్యోతి ఉన్నారు.

అప్పు తిరిగి ఇమ్మన్నందుకు దాడి

పార్వతీపురం: తనకు రావల్సిన డబ్బు అడిగినందుకు కొట్లాట జరిగింది. గురువారం రాత్రి జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. పార్వతీ పురం పట్టణంలోని చిన్నదేవర వీధికి చెందిన పి.సంతోష్ గతంలో ఆర్‌టీసీలో హెల్పర్‌గా పనిచేసిన బి.సంతోష్‌కు రూ.1000 అప్పు ఇచ్చాడు. ఈ మేరకు గతంలో ఇచ్చిన నగదును ఇమ్మని గురువారం రాత్రి పాత బస్‌స్టాండ్‌వద్ద ఉన్న బి.సంతోష్‌ను అప్పు ఇచ్చిన పి.సంతోష్ అడగగా ఇద్దరి మధ్యా మాటామాటా పెరిగింది. దీంతో అప్పు ఇచ్చిన పి.సంతోష్‌ను పలుచోట్ల బి.సంతోష్ కొట్టి సెల్‌కూడా లాక్కున్నాడు. ఈ నేపథ్యంలో పి.సంతోష్‌కు చికిత్స కోసం కుటుంబసభ్యులు జిల్లా ఆస్పత్రిలో చేర్చారు.

క్లుప్తంగా

'హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ తప్పనిసరి'

శ్రీకాకుళం రూరల్: రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ మోటార్ వాహనం చట్టం కింద కొత్త వాహనాన్ని డీలర్ నుంచి కొనుగోలు చేశాక హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్‌ను అమర్చిన తర్వాతే వాహనాన్ని రోడ్డు మీద నడపాలని జిల్లా ఉపరవాణా శాఖాధికారి టి.శివరాం ప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ఇక నుంచి షోరూంల డీలర్లు సైతం హెచ్‌ఆర్‌సీ నంబర్ అమర్చిన తర్వాతే కొనుగోలు దారులకు వాహనాన్ని డెలివరీ ఇవ్వాలని కోరారు. హెచ్‌ఆర్‌సీ నంబర్ లేకుండా వాహనాన్ని డెలివరీ చేసి రోడ్ల మీద కనిపిస్తే ఆయా డీలర్లపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆ ప్రకటనలో హెచ్చరించారు.

మందస ఏటీడబ్ల్యూఓకు డీటీడబ్ల్యూఓ బాధ్యతలు



ఐటీడీఓ పీఓ కల్పనాకుమారి నుంచి డీటీడబ్ల్యూఓగా బాధ్యతలు తీసుకుంటున్న శ్రీనివాసరావు

మందస: ట్రైబల్ వెల్ఫేర్ శాఖలో మందస అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ అధికారిగా పని చేస్తున్న మేడిద శ్రీనివాసరావుకు జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారిగా అదనపు బాధ్యతలను ఐటీడీఏ అప్పగించింది. గతంలో పూర్తిస్థాయి అదనపు బాధ్యతలతో పనిచేసిన బి.నగేశ్ రిలీవ్ కావడంతో శ్రీనివాసరావుకు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలను అందిస్తూ డైరెక్టర్ ఆఫ్ ట్రైబల్ (ఏపీ, విజయవాడ) ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనా కుమారి శుక్రవారం ఉత్తర్వులను ఏటీడబ్ల్యూఓ శ్రీనివాసరావుకు అందజేశారు. డీటీడబ్ల్యూఓగా బాధ్యతలు తీసుకున్న శ్రీనివాసరావు ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది కె.సంతోష్‌కుమార్, కుప్పిలి అశోక్‌కుమార్ తదితరులు అభినందనలు తెలిపారు.

వడదెబ్బ తగిలి వ్యక్తి మృతి

పొందూరు: మండలంలోని తుంగపేట గ్రామానికి చెందిన తాపీ మేస్త్రి ఇలపండ శ్రీరామ్మూర్తి(43) శుక్రవారం వడదెబ్బకు గురై మృతి చెందారు. సంతకవిటి మండలంలోని సిరిపురం గ్రామంలో తాపీ పని చేస్తుండగా వడదెబ్బ తగిలింది. వెంటనే సహచరులు ఆయనను పొందూరు ఆస్పత్రికి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమించడంతో అక్కడ నుంచి శ్రీకాకుళం తరలించారు. అయితే ఆస్పత్రికి వచ్చేటప్పటికే చనిపోయారని వైద్యులు ధ్రువీకరించారు. మృతుడుకి భార్య మేఘన, రెండు నెలల బాబు, 12 ఏళ్ల కుమార్తె ఉన్నారు.

వార్డుమెంబర్ మృతి

బూర్జ: మండలంలో గల వైకుంఠపురం పంచాయతీ వార్డు మెంబరు గురుగుబెల్లి సీతమ్మ (72) వడదెబ్బ తగిలి శుక్రవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం, వేడి గాలులు వీయడంతో ఆ ధాటికి తట్టుకోలేక ఆమె ఉదయం మృతి చెందినట్లు తెలియజేశారు. ఈమె ప్రస్తుతం గ్రామ 4వ వార్డు మెంబరుగా కొనసాగుతున్నారు. ఆమె మృతికి సర్పంచ్ బొడ్డేపల్లి వెంకటసత్యం, సహచర వార్డు సభ్యులు, పలువురు గ్రామస్తులు సంతాపాన్ని వ్యక్తం చేశారు.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

సారవకోట : మండలంలోని చిన్నకిట్టాలపాడు పంచాయతీ వెంకంపేటకు చెందిన జమినివలస చిన్నప్పన్న (53) గురువారం పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇద్దరు కుమార్తెలు వివాహం చేసుకునేందుకు అంగీకరించకపోవడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఉన్న పురుగు మందును తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు పాతపట్నం సీహెచ్‌సీకి తరలించగా పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ అప్పారావు తెలిపారు. భార్య చిన్నమ్మడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శుక్రవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

ఆరేళ్ల చిన్నారిపై లైంగికదాడి

కొత్తూరు: మండలంలోని జోగిపాడులో ఆరేళ్ల చిన్నారిపై లైంగికదాడి జరిగింది. ఈ నెల 14న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జోగిపాడుకు చెందిన ఇంటర్ విద్యార్థి యెన్ని రాజేష్ ఈ నెల 14న సాయంత్రం పక్కింటికి చెందిన ఆరేళ్ల పాప ఆడుకుంటుండగా తనతో తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. అస్వస్థతకు గురైన చిన్నారిని ఆస్పత్రికి తీసుకెళ్లగా లైంగిక దాడికి గురైనట్లు వైద్యులు నిర్ధారించారు. విషయాన్ని చిన్నారి తన తల్లిదండ్రులకు చెప్పడంతో బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ మురపాక గోవింద కేసు నమోదు చేశారు. టెక్కలి డీఎస్పీ డి.బాలచంద్ర రెడ్డి శుక్రవారం గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. స్థానికులతో మాట్లాడి వివరాలు సేకరించారు. సీఐ ఆర్.వేణుగోపాలరావు పాల్గొన్నారు.

అరసవల్లిలో మహాలింగార్చన

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో మాసశివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం ఉదయం అనివెట్టి మండపంలో మహా లింగార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో శ్రీచక్ర శివ పంచాయతన సహిత మహాలింగార్చన అభిషేక కార్యక్రమాన్ని అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ శాస్త్రోక్తంగా నిర్వహించారు.

సిక్కోలు విద్యాసుమాలు

దేశవ్యాప్త పరిమళాలు



సిక్కోలు కీర్తి పతాకం ఉవ్వెత్తున ఎగురుతోంది. పరీక్ష ఏదైనా మన పిల్లలు టాప్ ర్యాంకులు కొడుతున్నారు. సివిల్స్ నుంచి ఎంసెట్ వరకు, నీట్ నుంచి పాలిసెట్ వరకు అన్ని రకాల పరీక్షల్లోనూ సిక్కోలు విద్యార్థులు ప్రథమ శ్రేణి ర్యాంకులు సాధిస్తున్నారు. రేపటి తరం విద్యార్థులకు స్ఫూర్తిని పంచుతూ సిక్కోలు విద్యా పతకాన్ని విను వీధిన ఎగరేస్తున్నారు.



- మెరుస్తున్న శ్రీకాకుళం విద్యార్థులు
- నీట్‌లో ఆలిండియా మొదటి ర్యాంకు సాధించిన పోలాకి విద్యార్థి
- సివిల్స్‌లో సత్తా చాటిన ఇద్దరు సిక్కోలు వాసులు
- ఏపీ, తెలంగాణ ఎంసెట్‌లో టాప్ ర్యాంకుల్లో సిక్కోలు పిల్లలు
- పీజీఈ సెట్, పాలిసెట్‌లో సిక్కోలుకే మొదటి ర్యాంకులు
- ఆలిండియా పోటీ, ప్రవేశ పరీక్షల్లో సత్తా చాటుతున్న జిల్లా విద్యార్థులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

దేశ వ్యాప్తంగా విద్యా రంగంలో సిక్కోలు జెండా రెపరెపలాడుతోంది. మన విద్యార్థులు అన్ని రకాల పోటీ, ప్రవేశ పరీక్షల్లో సత్తా చాటుతున్నారు. జిల్లా వెనుకబడి ఉండవచ్చు గానీ తాము కాదని నిరూపిస్తున్నారు. రాబోయే తరం విద్యార్థులకు స్ఫూర్తిగా, ఆదర్శంగా నిలుస్తున్నారు. దేశంలో ఎక్కడికెళ్లినా సిక్కోలు ప్రజలు ఉంటారు. విదేశాల్లో కూడా మనోళ్లు కనిపిస్తారు. ఒకప్పుడు పొట్ట చేతపట్టుకుని వలస వెళ్లే వారిలో మనవాళ్లదే ప్రథమ స్థానం. ఆ పరిస్థితులు మెల్లమెల్లగా మారుతున్నాయి. మన విద్యార్థులు మంచి ర్యాంకులు కొడుతున్నారు.

సంకల్ప సిద్ధి

సంకల్పం, కష్టపడే తత్వం సిక్కోలు సొంతం. ఆ రెండూ ఉంటే చాలు ఉన్నత స్థాయికి ఎదగవచ్చని జిల్లాకు చెందిన చాలా మంది నిరూపిస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే చాలా మంది యువత ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్‌ఎస్, ఐఎఫ్‌ఎస్ తదితర సివిల్ సర్వీసు ఉద్యోగాలు సాధించారు. వారి స్వప్నాన్ని సాకారం చేసుకున్నారు. ఇక ఇంజినీరింగ్ విభాగంలోని అత్యున్నత పదవుల్లో వందల మంది ఉన్నారు. పేదింటిలో పుట్టిన ఎంతోమంది దేశ వ్యాప్తంగా, రాష్ట్రమంతా నిర్వహిస్తున్న పోటీ, ప్రవేశ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచడమే కాకుండా టాప్ ర్యాంకులు సాధిస్తున్నారు. పరిసరాల ప్రభావం, పరిస్థితుల నేపథ్యంలో ఇక్కడ యువకుల్లో ఏదో ఒకటి సాధించాలనే తపన ఎక్కువగా ఉంది. ఆ ఫలితాలు ఇప్పుడు కనిపిస్తున్నాయి.

విజేతల్లో కొందరు..



కళ్యాణి

- శ్రీకాకుళం మండలం ఒప్పంగి గ్రామానికి చెందిన చల్లా కళ్యాణి దేశ వ్యాప్తంగా నిర్వహించిన యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్ 2022 పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 286 వ ర్యాంకు సాధించారు. కళ్యాణి తండ్రి అశిరినాయుడు వ్యవసాయంతో పాటు తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నారు.



వరుణ్ చక్రవర్తి

- పోలాకి మండలం గొల్లవలస పరిధిలోని తోటాడ గ్రామానికి చెందిన బోర వరుణ్ చక్రవర్తి దేశ వ్యాప్తంగా నిర్వహించిన నీట్ పరీక్షల్లో ఆల్‌ఇండియా మొదటి ర్యాంకు సాధించారు. తెలంగాణ ఎంసెట్‌లో అగ్రికల్చర్ అండ్ మెడికల్ విభాగంలో ఐదో ర్యాంకు సాధించగా, ఆంధ్రప్రదేశ్ ఎంసెట్ అగ్రికల్చర్ అండ్ మెడికల్ విభాగంలో రెండో ర్యాంకు సాధించారు.



అనిరుధ్

- తెలంగాణ ఎంసెట్ ఇంజినీరింగ్ విభాగంలో సనపల అనిరుధ్ మొదటి ర్యాంకు సాధించాడు. నందిగాం మండలం దిమిలాడ గ్రామానికి చెందిన సనపల ఖగేశ్వరరావు, ఝాన్సీల కుమారుడు. ఈయన జేఈఈ మెయిన్స్‌లో 122వ ర్యాంకు సాధించాడు.



సంజన

- శ్రీకాకుళంలోని అరసవల్లికి చెందిన బోయిన సంజన తెలంగాణ ఎంసెట్‌లో ఇంజినీరింగ్ విభాగం నుంచి 8వ ర్యాంకు సాధించారు. గణేష్, భాగ్యజ్యోతి దంపతుల కుమార్తె సంజన ఇటీవల వెలువడిన ఏపీ ఎంసెట్‌లో 20వ ర్యాంకు సాధించారు.
- పొందూరుకు చెందిన సాయి వెంకట్ యశ్వంత్‌నాయుడు ఏపీ ఎంసెట్‌లో అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో స్టేట్ 7వ ర్యాంకు సాధించారు.
- శ్రీకాకుళం పీఎస్‌ఎస్‌ఎం స్కూల్ సమీపంలోని కొన్నా వీధికి చెందిన పొట్నూరు ఆశిస్ ఏపీ ఎంసెట్‌లో అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో స్టేట్ 9వ ర్యాంకు సాధించారు. నీట్ పరీక్షల్లో ఆలిండియా 57వ ర్యాంకు సాధించారు. ఓబీసీ కేటగిరిలో 12వ ర్యాంకు సాధించారు.
- శ్రీకాకుళానికి చెందిన డోల సూర్యసాయి జేఈఈ మెయిన్స్‌లో ఆలిండియా 106 ర్యాంకు సాధించారు. ఆమదాలవలసకు చెందిన ఎంవీవీ హర్షవర్ధన్ ఆలిండియాలో 211 ర్యాంకు సాధించారు. ఏపీ ఎంసెట్‌లో కూడా హర్షవర్ధన్ 29వ ర్యాంకు సాధించారు.
- పాలిటెక్నిక్ డిప్లమో కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఏపీ పాలిసెట్-2023 ఫలితాల్లో పలాస-కాశీబుగ్గలోని టీచర్స్ కాలనీకి చెందిన లఖినాన వెంకటాచలం, శ్రీదేవి దంపతుల కుమారుడు శ్రీకర్ స్టేట్ 16 ర్యాంకు సాధించారు. ఎచ్చెర్ల మండలం బుడుమూరు గ్రామానికి చెందిన విక్రమ్‌రాజా స్టేట్ 37ర్యాంకు సాధించారు.



సంతోష్‌కుమార్

- సారవకోట మండలం అలుదు గ్రామంలో తన తాతయ్య పొన్నాన కృష్ణ మూర్తి ఇంట్లో ఉంటూ చదువుకున్న భవిరి సంతోష్‌కుమార్ సివిల్స్‌లో 607వ ర్యాంకు సాధించి సత్తా చాటారు.



ప్రవీణ్‌కుమార్

- ఏపీ పీజీఈ సెట్‌లో శ్రీకాకుళం నగరానికి చెందిన మాలి ప్రవీణ్‌కుమార్ ఫార్మసీ విభాగంలో మొదటి ర్యాంకు సాధించారు. అలాగే, నగరానికి చెందిన సింహాద్రి లహరి కూడా జియో ఇంజినీరింగ్ అండ్ జియో ఇన్ఫర్మేటిక్స్ విభాగంలో ప్రథమ ర్యాంకు సాధించారు.



మిట్టు మహాపాత్రో



షణ్ముఖ వికాస్



కొండప్ప ఇందు

- పదో తరగతి పరీక్షల్లో ఆమదాలవలసకు చెందిన సనపల యశస్వి 600 మార్కులకు గాను 595 మార్కులు సాధించి ఆదర్శంగా నిలిచారు. పాతపట్నం ప్రభుత్వ పాఠశాలలో చదివిన మిట్టు మహాపాత్రో 594 మార్కులు, నరసన్నపేట మండలం చల్లపేటకు చెందిన వెలమల ఆదిత్య 594, తంబయ్యపేటకు చెందిన జి.యామిని 594, శ్రీకాకుళంకు చెందిన ఎం.వివేక్ 594, శ్రీకాకుళంకు చెందిన పి.తనూజ 594మార్కులు, శ్రీకాకుళంకు చెందిన ఆర్.అనుదీప్ 592మార్కులు, ఆమదాలవలసకు చెందిన పేడాడ షణ్ముఖ వికాస్‌కు 591 మార్కులు, వజ్రపుకొత్తూరు ప్రభుత్వ పాఠశాలలో చదివిన కొండప్ప ఇందు 590మార్కులు సాధించి జిల్లా ఖ్యాతిని రాష్ట్ర వ్యాప్తంగా ఇనుమడింపజేశారు.

'వైద్యులు సమయపాలన పాటించాలి'



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో మాతాశిశు మరణాలు ఉండకూడదని, ఆ బాధ్యత సంబంధిత వైద్యులపైనే ఉందని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు వివిధ కారణాలతో సంభవించిన మాతా శిశు మరణాలపై కలెక్టర్ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. మాతాశిశు మరణాలకు గల కారణాలను సబ్ కమిటీ ద్వారా అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లోని వైద్యులు సమయపాలన పాటించడం లేదని, ఆదివారం, సెలవు దినాల్లో వైద్యులు అందుబాటులో ఉండటం లేదనే ఫిర్యాదులు తమ దృష్టికి వచ్చాయన్నారు. వైద్యులు తమకు కేటాయించిన విధులకు తప్పక హాజరుకావాలని, అలాగే సాయంత్రం 4 గంటల వరకు విధుల్లో కచ్చితంగా ఉండాలన్నారు. విధులకు గైర్హాజరైన, సమయపాలన పాటించని వారిపై చర్యలు తప్పవన్నారు. హైరిస్క్ కేసులను ముందుగా గుర్తించి సాధ్యమైనంత మేరకు ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించాలని సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మీనాక్షి, జిల్లా మాస్ మీడియా అధికారి పి.వెంకటరమణ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఆర్వీఎస్ కుమార్, ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ లక్ష్మీతులసి, రిమ్స్ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ పార్వతి, పీహెచ్‌సీలకు చెందిన వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో యోగాకు ప్రాధాన్యం

ఎచ్చెర్ల క్యాంపస్: సంపూర్ణ ఆరోగ్యానికి ప్రతిఒక్కరూ యోగా చేయడం అలవరుచుకోవాలని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) ఎస్‌ఎంపురం క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు అన్నారు. యోగా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం క్యాంపస్‌లో ప్రచార ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాను ఐక్యరాజ్య సమితి గుర్తించాక అంతర్జాతీయంగా ప్రాధాన్యత పెరిగిందన్నారు. సంతోషకర జీవితం, వ్యాధులకు దూరం కావాలంటే జీవన శైలిలో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు. విద్యా సంస్థల్లో యోగాకు ప్రాధాన్యమిస్తున్నారని తెలిపారు. ప్రాథమిక విద్య నుంచి యోగా, ధ్యానం జీవితంలో భాగం చేసుకుంటే ఒత్తిడి లేని జీవనం సొంతమవుతుందన్నారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ ప్రొఫెసర్ ఎల్.సుధాకర్‌బాబు, పరిపాలనాధికారి ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి, యోగా విభాగాధిపతి ఈశ్వరరావు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితం నాశనం



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

ఎచ్చెర్ల క్యాంపస్: జీవితాన్ని నాశనం చేసే మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం సెమినార్ హాలులో శుక్రవారం దివ్యాంగ సంక్షేమ శాఖ, జిల్లాన్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. క్రమశిక్షణతో మెలిగి చదువుపై దృష్టి పెట్టి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. నిషేధిత మత్తు పదార్థాలు కనిపిస్తే పోలీస్ శాఖకు, విశ్వవిద్యాలయం అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. సంఘ విద్రోహ శక్తులు విద్యా సంస్థలు లక్ష్యంగా మాదక ద్రవ్యాలు వ్యాపారం చేస్తుంటాయని, వీటి పట్ల అప్రమత్తంగా ఉండాలని హితవుపలికారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్, దివ్యాంగ సంక్షేమ శాఖ ఏడీ కవిత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రాజు, సూర్య ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

హైవేలకు దీటుగా రహదారులను తీర్చిదిద్దాలి

- స్పీకర్ తమ్మినేని సీతారాం



స్పీకర్‌ను కలిసిన ఆర్అండ్‌బీ డీఈఈ జగన్నాథం

ఆమదాలవలస : ఆమదాలవలస నియోజకవర్గ పరిధిలో రహదారులను జాతీయ రహదారులకు దీటుగా తీర్చిదిద్దాలని రాష్ట్ర శాసన సభాపతి తమ్మినేని సీతారాం అధికారులకు సూచించారు. ఆమదాలవలస రహదారుల భవనాల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఐవీఎస్ జగన్నాథం శుక్రవారం స్పీకర్ క్యాంపు కార్యాలయం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ రహదారులతో పాటు వంతెనలు, భవనాల నిర్మాణాల పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇందు కోసం అధునాతన వస్తు సామగ్రి, టెక్నాలజీ వినియోగించాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాల్లో రాజీపడవద్దన్నారు. రహదారుల కనెక్టివిటీ పెంచి రవాణా వ్యవస్థను మెరుగుపరచాలన్నారు. బలసలరేవు వారధి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సూచించారు.

మంత్రులను కలిసిన సంత స్థలం పోరాట కమిటీ



మంత్రి ధర్మానతో సంత స్థలం పోరాట కమిటీ ప్రతినిధులు



పలాసలో మంత్రి సీదిరిని కలిసిన కమిటీ సభ్యులు

కంచిలి: మండలంలోని అంపురం పంచాయతీ పరిధిలో నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతున్న సంత స్థలానికి సంబంధించి వివాదం ఏర్పడిన నేపథ్యంలో సంత స్థలం పోరాట కమిటీ తాజాగా శ్రీకాకుళంలో రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, పలాసలో రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజులను శుక్రవారం కలిశారు. సంత స్థలాన్ని కొందరు కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్నారని వారికి తెలియజేశారు. మండల రైతాంగానికి ఉపయోగపడుతున్న సంత స్థలం ఆక్రమణ కాకుండా చూడాలని విన్నవించారు. దీనిపై మంత్రి ధర్మాన స్పందించి.. స్థలం ప్రజాప్రయోజనాలకు ఉపయోగపడేలా చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్‌ను ఆదేశించారు. మంత్రి అప్పలరాజు సైతం స్థలం వివరాలపై పలాస ఆర్డీఓ సీతారామ్మూర్తితో చర్చించారు. రైతులకు మద్దతుగా ఉండాలని సూచించారు. ఎంపీపీ దేవదాస్‌రెడ్డి, మృత్యుంజయరావు పాల్గొన్నారు.

విభజన హామీల అమల్లో..

రాష్ట్రానికి తీవ్ర అన్యాయం

- రెవెన్యూ లోటు పూడ్చడంలో కేంద్రం విఫలం
- అంబేడ్కర్ వర్సిటీ చర్చాగోష్టిలో వక్తలు



చర్చగోష్టిలో పాల్గొన్న మేధావులు

ఎచ్చెర్ల క్యాంపస్ :

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజనలో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య అన్నారు. 'రాష్ట్ర విభజన, హామీల అమలు, కేంద్ర ప్రభుత్వ పాత్ర' అనే అంశంపై శుక్రవారం వర్సిటీ సెమినార్ హాల్లో మేధావుల చర్చాగోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా అడ్డయ్య మాట్లాడుతూ 2014లో ఏపీ ప్రజలు సమైఖ్య రాష్ట్రం కోరుకున్నా విభజన చేపట్టారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో యూపీఏ ప్రభుత్వం రాష్ట్ర విభజన చేస్తే, బీజేపీ ఆధ్వర్యంలో ఎన్‌డీఏ ప్రతిపక్షంగా మద్దతు ఇచ్చిందని చెప్పారు. ఐదేళ్ల పాటు రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని యూపీఏ చెబితే.. ఐదు కాదు పదేళ్లు ఇస్తామని ఎన్‌డీఏ చెప్పిందని, అధికారంలోకి వచ్చాక ప్రత్యేక హోదా సాధ్యం కాదని మాటమార్చిందని దుయ్యబట్టారు. పార్లమెంట్, క్యాబినేట్ తీర్మాణాల మేరకు విభజన హామీలు అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీలో రెవెన్యూ లోటు పూడ్చే చర్యలు కేంద్ర ప్రభుత్వం చేపట్టలేదన్నారు.

– జేఏసీ సభ్యుడు డాక్టర్ బి.వి.రమణమూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం ఏపీకి శాపంగా మారిందన్నారు. విభజన హామీలు నేరవేర్చకపోవటం అన్యాయమని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ముందుకు సాగుతోందని, అయితే కేంద్రం మద్దతు లేకపోవటం దురదృష్టకరమని పేర్కొన్నారు.

- జేఏసీ సభ్యులు డాక్టర్ శాంతి మాట్లాడుతూ విభజన సక్రమంగా జరగకపోవడం వల్ల తెలంగాణ రాష్ట్రం ధనిక రాష్ట్రంగా మారితే, ఏపీ పేద రాష్ట్రంగా మారిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ పరిమిత బడ్జెట్‌తో ముందుకు సాగుతోందని చెప్పారు.
- జేఏసీ సభ్యుడు వై.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ చట్టసభల్లో చేసిన చట్టాలు అమలు కాకపోవటం అన్యాయమని తెలిపారు. ప్రజాభిప్రాయానికి భిన్నంగా అడ్డగోలుగా రాష్ట్రాన్ని విభజించి ఏపీకి తీరని అన్యాయం చేశారని చెప్పారు. వెనుకబడిన ప్రాంతాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై లేదా అని ప్రశ్నించారు.
- జేఏసీ సభ్యుడు డాక్టర్ హనుమంతు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యాసంస్థలు, పరిశోధన సంస్థలు, సాగునీటి ప్రాజెక్టులు ఏర్పాటు, పూర్తిచేయటం వంటి పనులపై కేంద్రం కనీస దృష్టి పెట్టలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థలు కనీస స్థాయి నిధులు లేకుండా పడి ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జేఏసీ సభ్యులు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొని రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు, అమల్లో లోపాలు, ఏపీకి జరిగిన అన్యాయంపై మాట్లాడారు.

ప్రధానంగా ప్రస్తావించిన అంశాలు...

- పోలవరం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి 2023కి పూర్తి చేస్తామని కేంద్ర హామీ ఇచ్చినా ఇప్పటికీ నత్తనడకన సాగుతోంది.
- ప్రత్యేక హోదా అంశం ఊసెత్తటం లేదు.
- విశాఖకు రైల్వేజోన్ కేటాయిస్తామన్నా ఎటువంటి పురోగతి లేదు.
- బుందేల్‌ఖండ్ తరహాలో ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు వెనుకబాటు ఆధారంగా ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించినా తాత్సారమే కనిపిస్తోంది.
- అనంతపురంలోని కేంద్రీయ విద్యాలయం, తాడేపల్లిగూడెంలోని ఎన్ఐటీ, విశాఖలోని పెట్రోలియం విశ్వవిద్యాలయం, ఐఐఎం, విజయనగరంలోని గిరిజన విశ్వవిద్యాలయం వంటివి బాలారిష్టాలు దాటలేదు. భవనాలు, బోధకుల నియామకాలు జరగలేదు.
- కడపలో స్టీల్‌ప్లాంట్ ప్రహరీకి మాత్రమే పరిమితమైంది.
- తెలంగాణలోని పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, ఫారెన్ లాంగ్వేజ్ యూనివర్సిటీలకు సంబంధించి ఏపీ వాటా విభజించలేదు.
- కేంద్రం ప్రకటించిన పెట్రో కారిడార్ నేటికీ ప్రాథమిక దశలోనే ఉంది.
- కేంద్ర పరిధిలోని విద్యుత్, అంతర్ రాష్ట్ర జల వివాదాల పరిష్కారంలో తాత్సారం వల్ల ఏపీ నష్టానికి గురవుతోంది.
- హైదరాబాద్ వంటి ఆదాయ వనరును ఏపీ కోల్పోయింది. శాశ్వత రాజధానికి కేంద్రం సహకారం లేదు.
- భారత పార్లమెంట్ నూతన భవన నిర్మాణానికి చేదోడుగా నిలిచి లాభాల బాటలో నడుస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నుంచి కేంద్రం విరమించుకోవాలి.
- ఏపీలో నిర్మాణం తలపెట్టిన పలు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు, మెడికల్ కాలేజ్‌లకు అవసరమైన నిధులు విడుదలలో తాత్సారానికి కేంద్రం ముగింపు పలకాలి.